క్లుప్తంగా

'బలగం' ఫేమ్ బాబుకు సన్మానం



ఐనవోలు : బలగం సినిమా ఫేమ్ బాబుతోపాటు ఆయన టీంను స్థానిక ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్‌కుమార్ గురువారం సన్మానించారు. మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో రెండ్రోజులుగా షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ సతీష్ సన్మానించి మాట్లాడారు. ఐలోని మల్లన్న ఆలయాన్ని ఎంచుకుని షూటింగ్ చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. షూటింగ్ ఐనవోలు ఆలయ శిల్ప సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేసి ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత విస్తరింపజేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన సినిమా దర్శకుడు రాధకృష్ణ, కెమెరామెన్ అరుణ, సహ దర్శకుడు కందునూరి శివ, జెడ్పీ సెకండరీ స్కూల్ చైర్మన్ రాజు, కళాకారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా రాంచందర్‌రావు



కమలాపూర్ : సర్పంచ్‌ల ఫోరం కమలాపూర్ మండల అధ్యక్షుడిగా కన్నూరు సర్పంచ్ పుల్లూరి రాంచందర్ రావు ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని గోపాల్‌పూర్, శనిగరం, గూడూరు, నేరెళ్ల, లక్ష్మీపురం, వంగపల్లి, మర్రిపల్లిగూడెం, గుండేడు, భీంపల్లి, కొత్తపల్లి, దేశరాజుపల్లి, అంబాల గ్రామాల సర్పంచ్‌లు ఈ మేరకు నిర్ణయించారు. తొలుత సర్పంచ్‌లు పలు రాజకీయ విషయాలపై చర్చించుకున్నారు. అనంతరం గత ఉపఎన్నికల సమయంలో ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న పెండ్యాల రవీందర్‌రెడ్డిని తొలగించి ఆ స్థానంలో కన్నూరు సర్పంచ్ రాంచందర్‌రావును నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

పద్మశాలి సంఘం కమిటీల ఎన్నిక




శాయంపేట: పద్మశాలీ సంఘం అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వావిలాల వేణుగోపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దకోడెపాక, కొత్తగట్టు సింగారం, అప్పయ్యపల్లి, నేరేడుపల్లి, రాజుపల్లి, నూర్జాహాన్‌పల్లి గ్రామాల్లో పద్మశాలీ గ్రామ కమిటీలను గురువారం ఎన్నుకున్నారు. పెద్దకోడెపాకకు వావిలాల రాజేందర్, కొత్తగట్టు సింగారానికి దూపేటి రమేష్, అప్పయ్యపల్లికి పెండెం శ్రీనివాస్, నేరేడుపల్లికి మోత్కూరి సత్యనారాయణ, రాజుపల్లికి కొండా మధూకర్, నూర్జాహాన్‌పల్లికి రాపెల్లి భాస్కర్‌లను అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొండబత్తుల ప్రకాశ్, సామల మధుసూదన్, బాసాని లక్ష్మీనారాయణ, దూపటి రమేష్, బూర ఈశ్వరయ్య, పల్నాటి జలంధర్, బూర పైడి తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం చేయండి'



పరకాల : రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన నేరెళ్ల శంకర్ కోరారు. తన కుటుంబంతో కలిసి ఆయన గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. పరకాలలోని వారసత్వంగా తనకు సంక్రమించిన భూమిని కొందరు కబ్జా చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. దామెర చెరువు సమీపంలోని సర్వే నంబర్ 609లో తమ తాత నేరెళ్ల సర్వయ్య పేరిట 1.19 ఎకరాల భూమి ఉండగా తమకు పట్టా పాసు పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అమ్ముకోవటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించాలని కోరారు.

ఈద్గాలో మున్సిపల్ కమిషనర్ పరిశీలన



పరకాల : పట్టణంలోని ఈద్గాను మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి గురువారం సందర్శించారు. రంజాన్ పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. రంజాన్ సందర్భంగా సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ముఫీనా ఫాతిమా హమీద్, షబ్బీర్ అలీ, శానిటేషన్ అధికారి వెంకట్‌రెడ్డి ఉన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం ధ్యేయం

నడికూడ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి తెలిపారు. గతేడాది వడగండ్ల వర్షానికి పంట దెబ్బతిని నష్టపోయిన మండలంలోని రాయపర్తి, వరికోలు, నడికూడ గ్రామాల రైతులకు జెడ్పీటీసీ కొడెపాక సుమలత, ఎంపీపీ మచ్చ అనసూర్య, వైస్ ఎంపీపీ చందా కుమారస్వామిలతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ సారంగపాణి ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో గురువారం పరిహారం చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కాగా అనర్హులకు పరిహారం మంజూరైందంటూ కొందరు రైతులు అసహనం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు మాత్రమే పరిహారం అందించినట్లు ఏఓ శ్రీనివాస్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సుధాటి వెంకన్న, సర్పంచ్ ఊర రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్శెట్టి చంద్రమౌళి, నాయకులు గణపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని రైతు వేదికలో గతేడాది మిర్చి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెక్కులను రైతుబంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని తెలిపారు.



నడికూడ : చెక్కు అందిస్తున్న సారంగపాణి

రైతుల నిరసన

తమకు పరిహారం రాలేదంటూ ల్యాదెల్ల, సింగరాజుపల్లి గ్రామాలకు చెందిన కొందరు రైతులు నిరసన తెలిపారు. తమ గ్రామాలకు చెందిన పంటల వివరాలను ఏఈఓ నమోదు చేసుకున్నా తమకు పరిహారం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇప్పించాలని కోరుతూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఏఓ శ్రీనివాస్, ఉద్యానవన అధికారి మధులిక, ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో, పెద్దాపూర్, నీరుకుళ్ల గ్రామాల్లో రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ ఎన్కతాళ్ల రవీందర్ రైతులకు పరిహారం చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు పరిహారం ఇప్పించేందుకు ఎమ్మెల్యే ధర్మారెడ్డి చొరవ తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, ఏఓ యాదగిరి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, పాపని రవీందర్, రాజస్వామి, రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌లు బలరాం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



దామెర : చెక్కు పంపిణీ చేస్తున్న రమణారెడ్డి



ఆత్మకూరులో..

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ముున్నూరు కాపు మహిళా మ్యాక్స్ హెచ్‌ఈఓ పురుషోత్తంరావు

కమలాపూర్ : మున్నూరు కాపు కుల మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలని మున్నూరు కాపు మహిళా మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్) ఉన్నత కార్యనిర్వహణాధికారి (హెచ్‌ఈఓ) సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ ఆకాంక్షించారు. మండలంలోని కమలాపూర్, గూడూరు, ఉప్పల్, భీంపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళా సభ్యులకు ఆయన సొసైటీ సభ్యత్వ గుర్తింపు కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. పాలకులు మున్నూరు కాపు కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని అంటున్నా అందుకు సంబంధించి ఎలాంటి ప్రణాళికలూ రూపొందించలేదని చెప్పారు. సొసైటీ డైరెక్టర్, సభాధ్యక్షురాలు బండారు శోభ రవీందర్ మాట్లాడారు. సుమారు వెయ్యి మందిని సభ్యులుగా చేర్పించే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితేనే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. మహిళా సభ్యులు ఐక్యంగా రాణించాలని చెప్పారు. కార్యక్రమాల్లో నాయకులు కాసెట్టి కుమార్, బండారు రవీందర్, మామిడిశెట్టి శేఖర్, ఇంజపురి మధు, ఎడ్ల రాజన్న, సత్తు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులు ఇస్తున్న పురుషోత్తమరావు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ఎల్కతుర్తి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ వంగ రవీందర్ కోరారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర, కొత్తకొండ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించొద్దని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని చెప్పారు. 17 శాతం లోపు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, సర్పంచ్‌లు రజిత, ప్రమీల, ఎంపీటీసీలు కౌసల్య, రాజమణి, ఏపీఎం దేవానంద్, సీసీ సదానందం తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవీందర్

అధికారుల దుష్ప్రచారం సరికాదు

- సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావు

ఎల్కతుర్తి : విశాల సహకార సంఘంలో అవకతవకలు జరిగాయని, తన భూమిని వేలం వేస్తామని అధికారులు దుష్ప్రచారం చేయడం సరికాదని సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర్‌రావు అన్నారు. రాజకీయ నాయకుల మాటలు పట్టుకొని అధికారులు తొందరపడొద్దని ఆయన హితవు పలికారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేశ్వర్‌రావు మాట్లాడారు. కోర్టులో కేసు నడుస్తున్న క్రమంలో జడ్జిమెంట్ రాకున్నా గ్రామ పంచాయతీలో పోస్టర్లు అంటించారని తెలిపారు. తాను అవకతవకలకు పాల్పడలేదన్నారు. బ్యాంక్‌ను తాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్టు చెప్పారు. బచ్చు కిషన్ రావు రూ.90 లక్షల అవినీతికి పాల్పడ్డట్టు నిర్ధారణ జరిగినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అధికారులు కూడా అవకతవకలకు పాల్పడ్డట్టు తేలినా చర్యలు తీసుకోలేదన్నారు. తాను భూమి అమ్ముకుని ఇల్లు కట్టుకున్నట్టు తెలిపారు. తనపై దుష్ప్రచారం మానుకోవాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే ఫర్టిలైజర్ షాపులను ఎత్తివేశారని చెప్పారు. రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వడం లేదన్నారు. రైతులకు ట్రక్‌షీట్లు ఇచ్చి ఉంటే డబ్బులు అందేవని తెలిపారు. వరికోతలు మొదలు కాగా హార్వెస్టర్‌ను ఎందుకు నడిపించడం లేదని ప్రశ్నించారు. తనను మానసికంగా, రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో నాయకులు తోకల శ్రీనివాస్, బొజ్జ గోపాల్, బొంకూరి అయిలయ్య, బొంకూరి యాదగిరి, అంబాల రాజు, దాట్ల సుధాకర్, అంబాల పోచయ్య, గుడెల్లి నవీన్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోలి రాజేశ్వర్‌రావు

సాయిబాబా ఆలయంలో చోరీ

పరకాల : పట్టణంలోని సాయిబాబా సత్సంగ్ మందిర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోకి మంగళవారం రాత్రి చొరబడిన దుండగులు సాయిబాబా విగ్రహం మీదున్న తులం బంగారు (కమ్మలు, ముక్కు పోగు) ఆభరణాలను చోరీ చేయడంతోపాటు హుండీని ధ్వంసం చేసి అందులోని కానుకలు ఎత్తుకెళ్లారు. రాత్రి 9 గంటలకు తాను ఇంటికి వెళ్లిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి చోరీకి పాల్పడ్డట్టు ఆలయ పూజారి కాటూరి రాము తెలిపారు. తెల్లవారుజామున ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన వాచ్‌మెన్ ఆలయ తలుపుల బేడెం ధ్వంసం చేసి హుండీలోని కానుకలు మాయం చేసి ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. హుండీని ఆలయానికి కొద్ది దూరంలో పడేసినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్‌టీంతో చేరుకొని డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలిని పరిశీలించారు. సాయిబాబా ఆలయంలో చోరీకి ముందు రోజు (సోమవారం) అయ్యప్ప ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులకు ఫిర్యాదు అందకపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు. సాయిబాబా ఆలయంలో చోరీతో వరుస దొంగతనాలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుల గురించి గాలిస్తున్నారు.

పరిహారం మంజూరులో మోసం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

నడికూడ : గతేడాది వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరీలో అన్యాయం జరిగిందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతినగా బాధితులకు ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినా కేవలం రూ.5 వేలు చొప్పున మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని ఆరోపించారు. రైతు ప్రభుత్వమని ఊదరగొడుతూనే బాధితులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన బీజేపీ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ సింగవేన రవీందర్, నాయకులు కోటి, ఎరుకల దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

అన్ని మతాలకు బీఆర్‌ఎస్ ప్రాధాన్యం

దామెర : అన్ని మతాలకు బీఆర్‌ఎస్ ప్రాధాన్యం ఇస్తోందని వైస్ ఎంపీపీ జాకిర్ అలీ తెలిపారు. మండలంలోని ఊరుగొండలో ఆయన గురువారం ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సమన్యాయం అందిస్తున్నారని చెప్పారు. రంజాన్ పండుగను పేద ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కూనాటి సునీల్‌రెడ్డి, మజీద్ కమిటీ అధ్యక్షుడు తాజుద్దీన్, సభ్యులు షబ్బీర్ అలీ, ఆజంఖాన్, ఖాలిద్, ఖైరత్, యూసుఫ్, రషీద్, రిజ్వాన్, అఖిల్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న జాకిర్ అలీ

ట్రాక్టర్ దొంగ అరెస్ట్



ఎల్కతుర్తి : ట్రాక్టర్ దొంగను పోలీసులు అరెస్ట్ చేసినట్టు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కోతులనడుమ గ్రామానికి చెందిన కోడిముంజల మహేష్‌కు చెందిన స్వరాజ్ ట్రాక్టర్ ఈనెల 1న చోరీకి గురైంది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు ఎస్సై జక్కుల పరమేష్ నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్, సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు నిందితులుగా శంకర్‌సింగ్ రాథోడ్, గెన రాకేష్‌లను గుర్తించారు. ట్రాక్టర్‌ను అమ్మేందుకు తీసుకెళ్తుండగా నిందితుడు శంకర్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌తో సహా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. నిందితులు నేరాన్ని అంగీకరించారు. దొంగతనానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని, శంకర్‌సింగ్‌ను రిమాండ్‌కు పంపుతున్నట్టు ఏసీపీ చెప్పారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించారంటూ ఎస్సై పరమేష్‌ను ఏసీపీ అభినందించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఏసీపీ చెప్పారు. వ్యాపారస్తులు, అవకాశమున్న ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్ ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

కమలాపూర్ : అంధత్వ నివారణే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని కానిపర్తి సర్పంచ్ మాట్ల రవీందర్ తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలో కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో ఆయన కంటి పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పసరగొండ శైలజ, ఉపసర్పంచ్ దబ్బెట అశోక్, వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ శోభ, తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ రవీందర్

దళితరత్న అవార్డులు అందజేత



అవార్డు తీసుకుంటున్న అంబాల రవీందర్



అవార్డు తీసుకుంటున్న అల్లకొండ రాజు

ఎల్కతుర్తి : మండల కేంద్రానికి చెందిన అల్లకొండ రాజు, వల్బాపూర్ గ్రామానికి చెందిన అంబాల రవీందర్, దండేపల్లి గ్రామానికి చెందిన కట్కూరి ఉపేందర్ హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్ చేతుల మీదుగా గురువారం దళితరత్న అవార్డులు అందుకున్నారు. వారిని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, సర్పంచ్ కొమ్ముడి నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, మేకల బాబురావు పాల్గొన్నారు.

రైళ్లపై దాడులు చేస్తే కఠిన చర్యలు

కాశిబుగ్గ: రైళ్లు, రైల్వే ఆస్తులపై దాడులు చేయరాదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత తామందరిపై ఉందని వరంగల్ ఆర్పీఎఫ్ సీఐ టీఎస్‌ఆర్. కృష్ణ సూచించారు. ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో యాకుబ్‌పురలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు హైదరాబాద్ మేరి కళా బృందం సభ్యులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చాలా చోట్ల రైళ్లపై దాడులు చేయడంతో ప్రయాణికులకు గాయాలు, రైల్వే ఆస్తులకు నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైళ్లు, రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే రైల్వే అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

బీఆర్‌ఎస్ యూత్ మండల కార్యదర్శిగా సతీష్

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామానికి చెందిన రామడుగు సతీష్‌ను బీఆర్‌ఎస్ పార్టీ యూత్ విభాగం మండల కార్యదర్శిగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్ కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం సతీష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడారు. తనను యూత్ మండల కార్యదర్శిగా నియమించినందుకు ఎమ్మెల్యేకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



టిప్పర్.. ఆర్టీసీ బస్సు ఢీ

శాయంపేట: టిప్పర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని కొత్తగట్టు సింగారం–మందారిపేట మధ్య గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ నుంచి పరకాల వెళ్తున్న ఆర్టీసీ బస్సు కొత్తగట్టు సింగారం స్టేజీ దాటిన తర్వాత కారును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు గాయాలు కాగా 13 మంది ప్రయాణిస్తున్న సురక్షితంగా ఉన్నారు. క్షతగాత్రుడు తుడుం కిషన్‌ను 108లో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ఆర్టీసీ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు

ఖిలా వరంగల్: నెల రోజుల పాటు ఉపవాస దీక్ష చేసిన ముస్లింలు.. రంజాన్ పండుగను శనివారం వైభవంగా నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం రాత్రి నెలవంక కనిపిస్తే శనివారం ఉదయం సామూహిక ప్రార్థనలు జరుపుకోవాలని ముస్లిం మత పెద్దల కమిటీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఈద్గాలో ఏర్పాట్లు చేశారు. ప్రార్థన స్థలాల్లో టెంట్లు, షామియానాలు వేశారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు వారి కుటుంబ సభ్యుల సమాధులను దర్శించుకునేలా కబరస్థాన్లను ముస్తాబు చేశారు. ఇప్పటికే మసీదులు, ఈద్గాలు, కబరస్థాన్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముస్లింలు సకాలంలో చేరుకోవాలి

శనివారం 9.30 గంటలకు జరగనున్న సామూహిక ప్రార్థనలకు ముస్లింలు సకాలంలో చేరుకోవాలని ఈద్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఈద్గా ప్రాంగణంలో ఈద్గా అభివృద్ధి కమిటీ కార్యదర్శి చాంద్‌పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ ప్రతినిధులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఫోర్ట్‌రోడ్డు ఈద్గాలో 36 వేలమంది ఏకకాలంలోనే సామూహిక ప్రార్థనలు చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు ముగ్దుం, దస్తగిరి, యాకూబ్, నసీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా శ్రీదేవి



నడికూడ : పరకాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నడికూడ అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్‌గా కందుల శ్రీదేవి బాధ్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తాను గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా విధులు నిర్వహిస్తూ ఐసీడీఎస్ పరీక్ష రాసి గ్రేడ్–2 సూపర్‌వైజర్‌గా ఎంపికైనట్టు తెలిపారు. ఇక్కడ పని చేసిన కవిత డిప్యుటేషన్‌పై హనుమకొండ ప్రాజెక్ట్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. శ్రీదేవిని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అభినందించారు.

'ఆరె' సంఘం కమిటీ ఎన్నిక



సంఘం కమిటీ సభ్యులు

ఎల్కతుర్తి : మండలంలోని దామెర గ్రామంలో ఆరె సంక్షేమ సంఘం స్థానిక కమిటీని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మోరె బాబురావు, అధ్యక్షుడిగా ఇరువాల ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా ఆదార్‌సండి శ్రీనివాస్, సుకినె చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా మాచనపల్లి రాజు, సహాయ కార్యదర్శులుగా మురాల శ్రీనివాస్, రవీందర్, కోశాధికారిగా కరాట్లపల్లి నగేష్, ప్రచార కార్యదర్శిగా కరాట్లపల్లి భూపతి, కార్యవర్గ సభ్యులుగా రాములు, బాపురావు, సతీష్, శివాజీ, కిషన్‌రావు ఎన్నికయ్యారు.

ఎమ్మెల్సీ కడియంకు వినతి



కడియం శ్రీహరితో సర్పంచ్, ముస్లింలు

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన ముస్లింలు సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని ఆయన నివాసంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని కబరస్థాన్‌కు ప్రహరీ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ జహంగీర్ (చోటు), యాసీన్, మస్తాన్ బాబా, సలీం, హఫీజ్, సాదిక్, యాకూబ్ పాషా, అన్వర్, రహీం, ముజ్జు, మునవర్, రఫీ, సజ్జు, షారుక్ తదితరులు పాల్గొన్నారు.